# హాస్యకథ

యర్రంశెట్టి శాయి



"సావిత్రీ! సావిత్రీ! ఓ సావిత్రీ!"

"ఎందుకలా సినిమాల్లో తండ్రి కారెక్టర్లా అరుస్తారు ? నేను మీ వెనుకే ఉన్నాను."

"సారీ! ఇక్కడే ఉన్నావా! ఓ మాంచి శుభ వార్త చెప్దామని పిలిచాను. చెప్పేయ్యనా ?" ఉత్సాహంగా అన్నాడు శ్రీనివాసరావ్.

సావిత్రి తనకేమీ పట్టనట్లు పెరటివేపు వెళ్ళిపోబోయింది.

"అరె! శుభవార్త వినమంటే ఎక్కడి కెళ్ళిపోతున్నావ్ ?" ఆమె చేయి పట్టుకుని ఆపుతూ అడిగాడు.

"వంటిల్లు క్లీన్ చేయాలి!"

"అంటే నేను చెప్పబోయే శుభవార్త కన్నా ఆ పనే ఎక్కువన్నమాట నీకు!"

"ఎక్కువకాదు. ఎక్కువ ఉపయోగం ఉంటుంది..."

"అంటే ? నా శుభవార్త దేనికీ పనికిరానిదని! అంతేనా ?"

"ఇంకెంత స్పష్టంగా చెప్పాలేమిటి ? ఇంత మడ్‌హెడ్‌ని ఎక్కడా చూళ్ళేదు నేను..." నవ్వాపు కుంటూ అందామె.

శ్రీనివాసరావ్ ఆమె చేతిని మెలితిప్పబోయాడు "నన్ను మడ్‌హెడ్ అంటావా ?"

"నేనేం కొత్తగా అనడంలేదు. లోకమంతా అనే మాటే! అమ్మో! చేయి నొప్పి! వదిలేయండి! ప్లీజ్!"

"మరి నేను చెప్పే శుభవార్త వింటావా లేదా ?"

"చెప్పండి!"

"నేను హాస్య కథల పోటీకి కథ రాస్తున్నాను."

సావిత్రికి నవ్వొచ్చింది.

"తప్పకుండా రాయండి! అప్పుడుగాని వాళ్ళ తిక్క వదలదు!"

శ్రీనివాసరావ్ అనుమానంగా చూశాడామెవేపు "ఎవరి తిక్క!"

"ఆ పత్రికవాళ్ళది. మీ కథ చదివారంటే జన్మలో మళ్ళీ హాస్య కథల పోటీ పెట్టరు!"

"అలా డామేజింగ్‌గా మాట్లాడావంటే పరువు నష్టం దావా వేస్తాను..."

"వేయండి! నా దగ్గర పావలా ఉండనే ఉంది. కట్టిపారేస్తాను..."

"యూ ... డెవిల్ ..." ఆమె మెడ పట్టుకో బోయాడతను.

"వద్దు నాన్నోయ్! అమ్మను చంపద్దు ..." బాబిగాడు పరుగులొచ్చి శ్రీనివాసరావును వెనక్కు తోశాడు.

"ఎందుకనిరా ?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీనివాసరావ్.

"తల్లిప్రేమ ..." గర్వంగా అంది సావిత్రి.

"అది కాదే! నాకాకలేస్తోంది. నాన్న నిన్ను చంపుతే అన్నం ఎవరొండుతారు ?"

"దొంగవెధవా! భోజనం ప్రేమేకాని తల్లి ప్రేమ లేదన్నమాట!" వాడి వీపుమీద ఒక్కటి చరుస్తూ అంది సావిత్రి.

చిట్టి పరుగులో శ్రీనివాసరావ్ దగ్గరకొచ్చింది.

"నాన్నా నా టెక్స్టు బుక్స్ కొనకపోతే క్లాసుకి రావద్దంది మా టీచరు ..."

"సరే! రానులే!"

"మీరు కాదు నాన్నా! నన్ను రావద్దంది."

"నిన్ను రావద్దందా ? ఆవిడకేమయినా బుద్ధి ఉందా ? ఫీజు కట్టలేదు కాబట్టి స్కూలుకి రావద్దని మొన్న చెప్పి ఇవాళ మళ్ళీ టెక్స్టు బుక్స్ అంటూ మాట తప్పుతుందా ? ఇలా నిముషానికో మాట మార్చడం నేను లైక్ చేయనని చెప్పు."

"అలా చెప్తే నన్ను కొడుతుంది! మీరే వచ్చి చెప్పండి!"

"తప్పకుండా వస్తాను. ఊహూ! రాలేను! నన్ను చూశాడంటే మీ హెడ్మాస్టరు కిందటేడు నాకంటగట్టిన బెనిఫిట్ షో టికెట్ డబ్బడుగుతాడు."

"ఇప్పుడు అడగడంలేదు నాన్నా! కొత్తవి ఇమ్మన్నాడు."

"ఎంత చల్లని కబురు చెప్పావురా! నీకేం కావాలో కోరుకో!"

"ఉట్టుట్టిగా కాదుగ!"

"ఉట్టుట్టిగా మనకేం ఖర్మరా! నేను పోటీకి మాంచి హాస్యకథ రాస్తున్నాను. బహుమతి రాగానే ఎవరికేం కావాలో అది కొనుక్కోండి—పొండి ..."

"నాన్నా! నాకు రిబ్బన్లు కొనిపెడతారా?"

"నాకు పెన్ను ..."

"ఛ ఛ! ఎదగండే బాబూ! అంత బహుమతి మొత్తం చేతికొస్తున్నా ఇంకా రిబ్బన్లూ, పెన్నులూ ఏమిట్రా నాయనా! ఖరీదయిన కోరికలు కోరండి."

"వాళ్ళను చదువుకోనీకుండా — వాళ్ళ టైమ్ ఎందుకు వేస్ట్ చేస్తారు?" కోపంగా అంది సావిత్రి.

"సటప్ సావిత్రీ! నీ హజ్బెండ్ కెపాసిటీ ఏమిటో నీకు తెలీడంలేదు. అతుకుల బట్టలేసుకుని, పెళ్ళాం బిడ్డలకు కడుపునిండా తిండి పెట్టలేక పోయినంత మాత్రాన వట్టి సన్నాసిగాడనుకోకు! బి. కామ్ సెకండియర్లో ఉండగా .."

"క్షమించండి! ఇంకెప్పుడూ అలా మాట్లాడను! ఇదిగో — లెంపలేసుకుంటున్నాను. ఇంక మీ కాలేజి విషయాలు చెప్పి శిక్షించకండి..." లెంపలేసుకుంటూ అంది సావిత్రి.

"నేను నీకేం చెప్పటంలేదు. నా ప్రియమయిన పిల్లలకు చెప్తున్నాను. ఒరే చిట్టీ, బాబీ, చంటీ - వినండ్రా! నేను కాలేజిలో చదువుతుండగా..."

"మీరు వెళ్ళి ఆడుకోండ్రా! మీ నాన్న మాటలు వింటూ కూర్చుంటే బాగుపడ్డట్లే ఇక." అందరినీ బయటకు తరిమేసింది సావిత్రి.

వాళ్ళు వెళ్ళిపోగానే ఆమె రెండు భుజాలూ గట్టిగా పట్టుకుని తనవేపు తిప్పుకున్నాడతను.

"చెప్పు! పిల్లల దగ్గర ఎందుకలా ఇన్సల్ట్ చేశావ్ నన్ను?"

"నేనేం చేయలేదు..."

"మరి వాళ్ళనెందుకు నా మాటలు వినకుండా పంపించేశావ్?"

"మీతో ఓ సీక్రెట్ మాట్లాడాలి కనుక!"

"ఏమిటది?"

"ఇంట్లో కొన్ని సరుకులయిపోయాయ్. అర్జంటుగా తేవాలి..."

"అదేమిటి? మన పెళ్ళయిన మొదటి రాత్రి ఒప్పందం ప్రకారం నెలమధ్యలో అదయిపోయింది, ఇదయిపోయింది అని చెప్పగూడదన్నానుగా..."

"ఇప్పుడు ఆ ఒప్పందం రద్దయిపోయింది."

"ఎందుకని?"

"పిల్లలు పెద్దవుతున్నారుగనుకా — మీ జీతం పెద్దవడంలేదు గనుక!"

"సరే! ఆ తెల్లకాగితాలూ — పెన్నూ తీసుకురా!"

"సరుకుల లిస్ట్ రాయడానికా?"

"కాదు. హాస్యకథ పోటీకి కథ రాస్తాను."

"మరి పూట భోజనం?"

"నారుపోసినవాడు నీరు పోయడా? అన్న పెద్ద మనిషెవరు?"

"తాగడానికి నీరు దొరక్క చచ్చిపోయాడు."

"గెటవుట్! నీ మొహం నాకు చూపించకు!"

"పెళ్ళయిన కొత్తలో ఈ మొఖమే చంద్ర బింబమని కవిత్వం చెప్పారు."

"మతి స్థిరంలేనప్పుడు చెప్పి ఉంటానలా!"

"మీకు మతి స్థిరం ఎప్పుడుందని అసలు?"

"నీతో మాట్లాడడం నా కిష్టం లేదు. సంచి తీసుకురా! అప్పు పుట్టించుకుని సరుకులు తెస్తాను."

సావిత్రి నవ్వు ఆపుకుంటూ లోపలికెళ్ళి సంచి తెచ్చిచ్చిందతనికి.

"ఇదిగో - ఏమేం వస్తువులు కావాలో ఈ చీటీలో రాస్తాను. అందులో 'వెరీ ఇంపార్టెంట్' అని ఉన్నవన్నీ ఎలాగయినా తేవాలి. మిగతావి దొరికే అప్పునిబట్టి."

"చిన్నప్పుడు పరీక్షల కోసం 'వెరీ ఇంపార్టెంట్' అని రాసుకొనే టెక్నిక్ ఇక్కడ ఉపయోగపడిందన్న మాట. నీకు చదువు చెప్పిన టీచర్ పేరేమిటి?"

"ఎందుకు? జోహార్లు అర్పిద్దామనా?"

"కాదు. రెండు నిముషాలు మౌనం పాటిద్దామని ..."

"రొట్టెలక్కర కిందటి నెలలోనే కొన్నాను."

"అయితే?"

"ఇంద్రానేసే కార్టూన్లు చూడడం లేదూ? దాంతో భార్యలు ఏం చేస్తారు?"

"అలాంటి కార్టూన్లువేసి భార్యలను ఇన్‌స్టిగేట్ చేస్తున్నందుకు ఆ ఇంద్రాని ఓ సారి మర్డర్ చేయాలనుంది. అతని అడ్రసేమిటి?"

"నారాయణ్‌గూడా వెళ్ళండి. మీలా అతనిని మర్డర్ చేయాలనుకున్న భర్తల 'క్యూ' అక్కడే ప్రారంభమవుతుందట ..."

శ్రీనివాసరావ్ సంచీ తీసుకుని సైకిల్‌కి తగిలించుకుని రోడ్డుమీద కొచ్చాడు.

జేబులోని పది పైసలు తీసి "బొమ్మ పడితే లక్ష్మణరావ్ — బొరుసు పడితే రామకృష్ణ..." అనుకుని గాలిలో కెగరవేసి పట్టుకున్నాడు. బొరుసు పడింది. రామకృష్ణ ఇంటి దగ్గర అరడజనుమంది పిల్లల మధ్య కూర్చుని ట్యూషన్ చెప్తున్నాడు.

"ఏమిట్రోయ్ ఇదెప్పటినుంచి?" నవ్వుతూ అడిగాడు శ్రీనివాసరావ్.

"ఈమధ్య రెండోపూట గడవదని తెలిసినప్పటి నుంచీ... ఏమిటి ఇలా వేళగానివేళ..."

"అప్పుకి వేళేమిటి? అర్జంటుగా అప్పు కావాలి!"

"ఎంత?"

"అది నీ తాహతునిబట్టి ఉంటుంది. ఎంతయినా తీసుకోడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

"పది రూపాయిలయితే సంతోషంగా ఇవ్వగలను!"

"ఏడుస్తూ అయితే ఎంతివ్వగలవ్?"

"ఇరవై!"

"ఇంకా భోరున ఏడుస్తూ అయితే?"

"ఏళ్లేదురా బాబూ! భోరున ఏడ్చే శక్తి లేదు."

"అయితే సరే! మామూలుగానే ఏడువ్?"

రామకృష్ణ లోపలికెళ్ళాడు.

లోపల వాద ప్రతివాదాలు అస్పష్టంగా వినబడినయ్.

"ఇరవై ఆయన కిచ్చేస్తే మనకెట్లా?"

"తప్పదే బాబూ! వాడికి ప్రామిస్ చేసేశాను. నైన్‌టీన్ సెవెంటీ ఎయిట్‌లో వాడు మనకి నలభయ్ తొమ్మిది రూపాయలు — ఎలాంటి సమయంలో అప్పిచ్చాడో గుర్తులేదూ?"

"నేను కాదనడంలేదండీ! మళ్ళీ మనకెలా అంటున్నాను..."

"ఉంగరం తాకట్టు పెడదాములే!"

"ఉంగరం ఎక్కడుంది మనకి?"


"ఇవాళ రాత్రికి ఎక్కడోచోట దొంగతనం చేసుకొస్తాగా..."

ఆమె నవ్వేసింది.

చిరునవ్వుతో బయటికొచ్చి ఇరవై నోటు శ్రీనివాసరావ్ కిచ్చాడు రామకృష్ణ.

"థాంక్యూరా బ్రదర్! మా ఆవిడ విధించిన ఎమర్జెన్సీకి నువ్వు స్టే ఆర్డరిచ్చావ్!" నవ్వుతూ అన్నాడు శ్రీనివాసరావ్.

మార్కెట్ చేరుకుని జేబులోనుంచి సావిత్రి ఇచ్చిన లిస్ట్ ఓసారి తీసి చూసుకున్నాడు. వెరీ ఇంపార్టెంట్ అన్న వస్తువులు రెండే వున్నాయ్.





## చైతన్య పుష్పం

విగుళ్ళ గుండెల్లో పలికేది
రేపటి పువ్వుల సంగీతం
కిరణం గుండెల్లో పలికేది
ఉదయరాగ రసగీతం.
నవ్వే పెదవుల కురిసేది
స్నేహభావాల తేనెవాన
మమతల మనమున విరిసేది
నవజీవన సుమభావన —
కొమ్మ కొమ్మ కోయిల గానం
ఎద ఎదలో తీయని అభిమానం
రాగభావ తాళ లయాన్వితం
సామూహిక సామాజిక జీవితం.

— రామసూరి

ఆ రెండూ తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. సంచీ చూసుకుని "మోస్ట్ హోప్‌లెస్ ఫెలో అయ్ హావ్ ఎవర్ సీన్ ..." అంది సావిత్రి.

"ఇక ముందు చూడబోవు కూడాను !"

ఆమెతోపాటు వంటింట్లోకి నడుస్తూ అన్నాడతను.

పిల్లలు వంట గదిలో కూర్చుని చదువుకుంటున్నారు.

"ఏమిటి వీళ్ళిక్కడ ?" సావిత్రి నడిగాడతను.

"బయట గదిలో బల్బుకీ — మనకీ అభిప్రాయ భేదాలొచ్చాయ్."

"అయితే నేను హాస్యకథ కిచెన్‌లో రాయాల్సిందేనా ?" చిరాగ్గా అడిగాడతను.

"ఎవరికోసం ? మీరేం దిగివచ్చారా ?" స్టౌ వెలిగిస్తూ అందామె.

"మర్యాదగా మాట్లాడు. నేను దిగేవచ్చాను."

"ఏమిటి ?"

"సైకిలు ..."

"ఇంత హీనమయిన జోకు ఇంతవరకూ వినలేదు ..."

"పోనీ నీ వంటయ్యాక ఈ బల్బు తీసుకెళ్ళి ఆ గదిలో పెడతాను."

"అంతపని చేయకండి. మీరు కదిపారంటె అది కూడా పేలిపోతుంది."

"జాగ్రత్తగా తీస్తానులే !"

"వద్దంటున్నాగా ! ఇదికూడా పోతే వారం రోజులు చీకట్లో వంట చేయాలి నేను ..."

"బ్లాక్ అవుట్ అంటే ఏమిటో తెలుసుకోవాలనుందన్నావుగా ఓసారి."

శ్రీనివాసరావ్ బయటికొచ్చి చీకట్లో కూర్చున్నాడు.

మరో వారంరోజులుంది హాస్యకథల పోటీకి గడువు.

## హాస్య కథ

హాస్యకథ ఎలా రాయాలి ?

కాళ్ళకేదో చల్లగా తగిలింది.

"నాన్నా ఎత్తుకో ..." చంటిది గారాంగా అంది.

"చీకట్లో ఎందుకొచ్చావే నువ్వు ?" దాన్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకొంటూ అన్నాడు.

దాని వళ్ళు వెచ్చగా తగిలిందతనికి.

"అన్నం తిన్నావమ్మా ?"

"అమ్మ... పెత్తలేదు..."

"ఆకలేస్తోందా ?"

"ఊ..."

వంటింటివేపు నడిచాడు శ్రీనివాసరావ్.

"సావిత్రీ ! ఈ చంటిదానికి జ్యోతిలక్ష్మి డ్రస్ వేశావేమిటి ?"

"ఏంచేయను ? బాత్‌రూమ్‌లో నీళ్ళతో ఆడి ఉన్న ఒక్క జతా తడిపేసుకుంది..."

"ఏరా చంటీ — అలా తడిపేసుకోచ్చా ?"

తల అడ్డంగా ఊపింది చంటి.

"మరి తెలిసెందుకు చేశావ్ ఆ పని ?"

"దాన్నిటివ్వండి ! అన్నం పెట్టేసి పడుకోబెడతాను..."

"నేలాను..." సావిత్రి చేతుల్లోకి వెళ్ళకుండా గింజుకుంటూ అంది.

"చూశారా ! ఇందాక ఒక దెబ్బ వేశానని ఎంత పౌరుషం వచ్చిందో దీనికి — ఇంతుందోలేదో అప్పుడే రోషాలూ, పౌరుషాలూ..." బలవంతంగా లాక్కుంటూ అంది సావిత్రి.

"దీనికి మళ్ళీ జ్వరం వచ్చినట్లుంది..." పొడిగా అన్నాడు శ్రీనివాసరావ్.

సావిత్రి మొఖం వాడిపోయింది.

"అవును !"

"రేపు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తాను ! రోజ రోజుకీ సన్నగా పుల్లలా అయిపోతోంది..."

ఆ రాత్రి పన్నెండు గంటలయినా శ్రీనివాసరావ్‌కి నిద్రపట్టలేదు. లేచి కూర్చున్నాడు.

"ఏమిటి ? మధ్యాహ్నం ఆఫీసులో బాగా నిద్రపోయారేమిటి నిద్రపట్టటంలేదు ?"

"మా ఆఫీస్‌లో నిద్రా ? నువ్వెప్పుడయినా నరకం చూశావా ?"

"మనం ఉంది అందులోనేగా !"

"ఎగ్జాక్ట్లీ ! దాని బాబులాగుంటుంది మా ఆఫీస్ ! ఇంక నిద్ర కూడానా ?"

"అయితే పడుకోండిక ! ఊరికే సిచ్చి ఆలోచనల్తో మనసు పాడుచేసుకోవద్దు."

"అదిసరేగాని సావిత్రీ! నాకు హెల్ప్‌చేస్తావా?"

"అలాంటివన్నీ మానేశాను."

"ప్లీజ్ ..."

"ఏమిటది ?"

"హాస్యకథలెలా రాయాలో చెప్తావా ?"

"నేనా ?"

"అవును ! ఇంటర్మీడియెట్ చదివేప్పుడు మీ కాలేజి మాగజైన్లో రాశావ్ కదా ! ఆ కథ చదివే నిన్ను లవ్ చేశాను అసలు"

"అయ్యో ! అది నేను రాసింది కాదండీ !" నవ్వాపుకుంటూ అంది సావిత్రి.

"మరి ?"

"మా పనిపిల్ల."

"నిజంగానా ?"

"ఏం ? ఇప్పుడు మా పనిపిల్లని లవ్ చేస్తారా ఏమిటి ?"

"యూ సిల్లీ గాళ్ ..."

"సరే ! కథెలా రాయాలో రేపు చెప్తానుగానీ, పడుకోండిక."

"ఓకే ! స్వీట్ డ్రీమ్స్ !"

"ఇప్పుడే కలవరిస్తున్నారా ?"

శ్రీనివాసరావ్ చిన్నగా నవ్వుకుని తన పక్కమీద పడుకున్నాడు.

మర్నాడు తెల్లారుజామునే నిద్రలేచి వంటింట్లో ఉన్న సావిత్రి దగ్గర కొచ్చాడతను.

"కమాన్ సావిత్రీ ! కాగితాలూ - పెన్నూ రడీగా ఉన్నాయ్. అవి మా ఆఫీస్ కాగితాలని ఆ పత్రిక వాళ్ళకు తెలిసిపోదుకదా !"

"ఏం ఫరవాలేదులెండి ! దేశమంతా ఆఫీస్ వస్తువులు, వాహనాలే ఉపయోగిస్తున్నారు సొంత పనులకు."

"థాంక్స్ ఫర్ యువర్ మోరల్ సపోర్ట్ ! నీవెప్పటికయినా ప్రధానమంత్రి అయితే నీనుంచి ఈ దేశాన్ని భగవంతుడే రక్షించాలి..."

"మీరేం కథ రాయాలనుకుంటున్నారో చెప్పండి ముందు..."

"హాస్య కథ !"

"సబ్జెక్ట్ కాదు నేనడిగేది ! థీమ్ !"

"ఏమీలేదు. ఒక బీదవాడు. అడుక్కుతినేవాడన్నమాట ! వాడు హాస్యంగా ఉంటాడు. హాస్యంగా మాట్లాడతాడు ! అంతే ! అదే థీమ్ !"

"అందులో నేమరాలిటీ ఉండదు !"

"ఎందుకని ?"

"అడుక్కుతినేవాడు ఎంతసేపూ ఆకలితోనూ, రోగాలతోనూ,కాళ్ళ నొప్పులతోనూ ఛస్తూంటాడు. ఇంక హాస్యమేమిటి మీ తలకాయ !"

"ఓకే ! నా హీరో అడుక్కుతినేవాడు కాదు. లక్షాధికారి ! బిజినెస్ మాగ్నెట్ ! ఇప్పుడు చెప్పు !"

"లక్షాధికార్ల జీవితంలోనూ హాస్యం ఉండదు."

"మరి ?"

"టెన్షన్ ! భయం."

"అంటే నేనసలు కథే రాయగూడదంటావ్ !"

"హాస్య కథ !"

"సరే ! ఛాలెంజ్ చేస్తున్నాను. రేపటికల్లా బ్రహ్మాండమయిన హాస్య కథ రాస్తాను. పందెం కడతావా ?"

"ఓ ! పందెమేమిటి ?"

"బహుమతి వస్తే అందులో సగం పెట్టి నీకు చీర కొనిస్తాను..."

"అయితే ఈ జన్మలో నాకు చీర కొనన్న మాట !"

అతను బయటి గదిలోకొచ్చి కథ రాయడానికి కూర్చున్నాడు.

కొద్దిసేపటితర్వాత చిట్టి లెక్కల పుస్తకం తీసుకొచ్చింది.

"నాన్నా ఈ లెక్క చెప్పవూ ?"

"ఏమిటి తల్లీ అది ?"

"ఒక సంస్థ డెబ్బయ్ కోట్ల పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించింది. సంవత్సరం అయేసరికి ఆ సంస్థకు రెండువందల కోట్ల ఆదాయం వచ్చింది. ఆ సంస్థకు లాభం వచ్చినట్లా, నష్టం వచ్చినట్లా? ఎంత శాతం ?"

"అది గవర్నమెంట్ సంస్థ అయితే నష్టం వచ్చినట్లు. ప్రైవేట్‌దయితే లాభం వచ్చినట్లు..."

అతని కోసం కాఫీ తీసుకొచ్చిన సావిత్రి ఆ జవాబు విని నవ్వింది.

"ఇంక ఈ పిల్లలకు చదువొచ్చినట్లే ! నాతో రావే చిట్టీ నేను చెప్తాను." సావిత్రి అడ్డుపడుతూ అంది.

"నేను అబద్దం చెప్పడం లేదోయ్ ! జరుగుతున్నకధే ఇది. ఎంత లాభం వచ్చినా, జీతాలు పెంచమంటారేమోనని ప్రభుత్వం ఎప్పుడూ 'నష్టం' అనే చెప్తుంది ... "

సావిత్రి చిట్టిని లోపలకు లాక్కుపోయింది.

మరి కాసేపటి తర్వాత చంటిదాన్ని గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడతను. రెండుగంటలు క్యూలో నిలబడ్డాక కుర్ర లేడీడాక్టర్ చంటిని పరీక్షించింది.

కాగితంమీద ఏవో మందులు రాసిచ్చింది.

"తరచుగా ఇలా జ్వరం వస్తూంది డాక్టర్ ! ఎందుకని ?"

"ఆ మందులు వాడు !"

"ఎక్కువగా దగ్గుతుంది కూడా !"

"సరే !"

"మరీ సన్నగా అయిపోతోంది రోజు రోజుకీ!"

"నెక్స్ట్... "

శ్రీనివాసరావ్ బయటికొచ్చేశాడు. మందు కాగితం చూశాడు. మేజరాల్ టాబ్‌లెట్స్ –

## హాస్య కథ

కాగితం చింపి అవతలపారేసి ఇల్లు చేరుకున్నాడు.

"ఏమన్నారు డాక్టర్ ?"

"గ్రామర్ దెబ్బతింది. 'డాక్టర్ ఏమంది ?' అనడగాలి !"

"సరే – ఏమంది ?"

"పాపకు జ్వరం వస్తోంది డాక్టర్...

ఆ మందులు వాడు.

—ఇలా తరచుగా జ్వరం వస్తూందండీ

—ఆ మందులు వాడు.

ఎక్కువగా దగ్గుతూందికూడా.

సరే

మరీ సన్నగా అయిపోతోంది రోజురోజుకీ.

నెక్స్ట్..."

ఇదీ డాక్టర్ అన్నది.

అతను ఆఫీసు కెళ్తోంటే చంటిది వెనుకే బయటివరకూ వచ్చింది.

"నాన్నా బిస్కెట్లు..."

"తెస్తానమ్మా ! నీ కోరిక ఖరీదు పదిపైసలకు మించనంతకాలం ఏం ఫరవాలేదు."

ఆఫీస్‌నుంచి అతను ఇంటికొచ్చేసరికి బాగా ఆలస్యం అయిపోయింది.

రాత్రి పన్నెండింటివరకూ వంటింట్లో కూర్చుని కథ రాశాడతను.

కుర్చీలో కూర్చునే నిద్రపోతోంటే సావిత్రి నిద్ర లేపిందతనిని.

"మీరిలా ఆరోగ్యం పాడుచేసుకుంటానంటే కథ రాయనివ్వను..." బాధగా అందామె.

"ఆరోగ్యం అనేది ఒకటుంటేకదా పాడవడానికి !"

"ముందు వెళ్ళి పడుకోండి !"

"మరి ఇంతవరకూ నేను రాసిన కథ చూడవా ?"

"ఎవరు చేసిన పాపం వారనుభవించాల్సిందే ! మధ్యలో నేనెందుకు చదవాలి ?"

"ప్లీజ్ !"

"ఊహూ ఇప్పుడుకాదు. రేపొద్దున్న..."

అతను వెళ్ళి పక్కమీద పడుకున్నాడు.

మర్నాడు తెల్లారుజామున లేచినప్పుడు అతను రాసిన కాగితాలు చూసింది సావిత్రి.

కృష్ణమూర్తి రోడ్డ రోలర్‌లా అరచాడు. ఆ అరుపుకి కాఫీ తాగుతున్న భాస్కరం నోట్లో ఉన్న కాఫీని వర్షంలా ఎదుటి సీట్లోని హెడ్ క్లర్క్ మొఖం మీదకు ఉమ్మాడు. హెడ్ క్లర్క్ సీట్లోంచి అదిరిపడిలేవబోయి కుర్చీతో సహా వెనుక ఉన్న టైపిస్ట్ పిల్ల కాళ్ళదగ్గర పడిపోయాడు. రజని ఆయనను చూసి కిసుక్కున నవ్వి తన చేతిలోని కార్బన్‌లు గదంతా గాల్లోకి వదిలేసింది. (ఇక్కడ పాఠకులు నవ్వుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాము.) ఆ తరువాత ఓ జోకర్ బొమ్మవేసి ఉంది.

"చాతకాపోతే ఊరుకోవాలి కానీ ఇలా హాస్యాన్ని చిత్రహింసలు పెట్టకండి" దానికింద రాసి సంతకం పెట్టింది సావిత్రి.

శ్రీనివాసరావ్ నిద్రలేస్తూనే ఆ కాగితాలు చూశాడు.

"సావిత్రీ" అంటూ కోపంగా అరచాడు.

"ఏమిటి ?"

"ఇలారా !"

అతని దగ్గరకు నడిచిందామె.

"ఎందుకు రాశావలా ?"

"చిన్నప్పటినుంచీ ప్రతి విషయం గురించీ ఫ్రాంక్‌గా నా అభిప్రాయాలు తెలియజేయడం అలవాటు ... "

"అయితే నాకు హాస్యం రాయడం రాదంటావ్!"

"ఇంకా చాలా రాకపోవచ్చు కానీ ప్రస్తుతం రుజువయిందొక్కటే ... "

"ఇవాళ రాత్రికి కథ పూర్తిచేసి ప్రైజ్ కొట్టకపోతే అప్పుడడుగు !"

ఆ సాయంత్రం అతను వచ్చేసరికి సావిత్రి కంగారుగా కనిపించింది.

"చంటిదానికి వళ్ళు కాలిపోతూంది చూడండి!"

శ్రీనివాసరావ్ చంటిదాని నుదిటిమీద చేయి ఉంచి చూశాడు. కాలిపోతోంది.

"అరె ! ఉదయం ఫరవాలేదనుకున్నానే !"

"త్వరగా డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దాం !"

"సరే ... "

పక్కింటివాళ్ళకు ఇల్లు అప్పచెప్పి ఇద్దరూ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ చేరుకున్నారు.

చంటిదాన్ని పరీక్షించి ఏవో మందులిచ్చాడు డాక్టర్. ఎక్స్‌రే కూడా తీశారు.

"పాపకు టి. బి. అని నాకు అనుమానంగా ఉంది. రేపు కన్‌ఫరమ్ అవుతుంది. ఉదయం రండి. టి. బి. హాస్పిటల్‌కి లెటర్ రాసిస్తాను..."

దిగులుగా ఇల్లు చేరుకున్నారిద్దరూ.

సావిత్రి ఇంక దుఃఖం ఆపుకోలేకపోయింది.

"చంటిది మనకు దక్కుతుందాండీ ?"

"మనం ధనవంతులమయితే తప్పక దక్కేది. ఎందుకంటే ఇది డబ్బున్నవాళ్ళకు రావలసిన జబ్బు ! రాంగ్ నంబర్ !"

ఆ రాత్రంతా చంటిదాన్ని కనిపెట్టుకునే ఉన్నారిద్దరూ. ఉదయం టి.బి. హాస్పిటల్ చిల్డ్రన్ వార్డ్‌లో చేర్పించారు.

సావిత్రి చంటిదాని బెడ్ పక్కనే దిగాలుపడి కూర్చుండిపోయింది.

శ్రీనివాసరావ్‌కి ఆమెను చూస్తూంటే కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"సావిత్రీ ! నేనెంత ఇడియట్‌నో చూశావా ! హాస్య కథ కోసం ఏమిటేమిటో ఆలోచిస్తున్నా నిన్నాళ్ళూ! నిజానికి ఇక్కడే మన దిక్కులేని కుటుంబాల్లోనే ఉంది హాస్యమంతా ! ఓ పక్క చచ్చేంత ఆకలేస్తూంటే తినడానికి తిండి ఉండదు ! అప్పుడు నిజంగా ఎంత ఫార్స్‌గా ఉంటుంది? పిల్లలు కోరే కోరికలనుంచి వారిని మరిపించడానికి ఎన్ని సరదా కబుర్లు చెప్పాలి ? మనలాంటివాళ్ళకు రావాల్సిన జబ్బులు ఇంకొకరికీ, ధనవంతులకు రావలసిన జబ్బులు మనకూ వస్తూంటే ఎంత నవ్వుగా ఉంటుంది ? క్షణక్షణానికీ ఛస్తున్నామని అనుకుంటూ చావకుండా నిక్షేపంలా బతికేస్తూంటే ఇంతకంటె హాస్యం ఇంకేముంటుంది ? ఇవన్నీ వదిలి వేరే హాస్య కథ లెందుకు ఆలోచించడం ?"

సావిత్రి జీవంలేని నవ్వు నవ్వింది ●